


సంధ్యను ఆక్రమించుతున్న తిమిరంలా అతని హృదయాన్నిండా దుఃఖం చోటు చేసుకుంది. కడలి కెరటాల్లాగే అతని ఆలోచనలు అస్థిరంగా కదలసాగినాయి.

గతం బాధాకరంగా: వర్తమానం భయంకరంగా; భవిష్యత్తు శూన్యంగా కన్పించాయి.

ఆత్మ స్థైర్యం పోయింది. అదృష్టం మీద నమ్మకం ఏనాడో పోయింది.

ఎంతదూరం పయనించినా కాంతికిరణం కనిపిస్తుందనే ఆశ లేదు.

జీవితంలో ఎంతో అలసిపోయాడు. ఇక ముందుకు పోలేడు.

అతడు నిశ్చయించుకున్నాడు. కిటికీ తలుపులు మూశాడు. గాలి హోరున మోత పెడుతోంది. తలుపు గడియ వేశాడు.

ఉత్తరం రాసి టేబుల్ పైన ఉంచాడు. ఆఖరుసారిగా గదిని పరికించాడు. ఒకవైపు బూజు, మరొకవైపు బట్టలు వేలాడుతున్నాయి. ఎముకలు కనబడుతున్న బీద వాడి శరీరంలా సున్నంపోయిన గోడలు, ఆ గోడలనిండా మరకలున్నాయి. అక్కడక్కడా దైన్యస్థితిలో ఉన్న చిత్ర పటాలు, ఒక చోట ఎండిపోయిన రంగులు, బ్రష్‌లు, కాన్వాసు ఉన్నాయి. ఆ ప్రక్కనే విరిగిన చాప, గలీబులేని పల్చని దిండు, అతుకులు వేసిన దుప్పటి చిందరవందరగా పడి ఉన్నాయి.

గోడమీదున్న సినీతార కొంటెగా నవ్వుతోంది. అతను బాధగా నవ్వుకున్నాడు. ఏముంది, తనదగ్గర! విడిచిపోతున్నానని విచారించేందుకు.

వర్షం ప్రారంభమైంది. పైనుంచి కారుతున్నా అతను నిర్లక్ష్యంగా చూశాడు.

అతని మనస్సు బరువైన విషయాల్ని ఆలోచిస్తోంది. తన జీవితంలో యిదే గడ్డు సమస్య. చివరి సమస్య కూడాను. తనను యిక ఏ సమస్యలు బాధించవు!

తనది మోడువారిన జీవితం. శరద్ను వలె తన హృదయం కరుడుగట్టుకు పోయింది. మమత, మానవత అన్నీ యింకి పోయాయి.

వర్షం హెచ్చింది. మెరుపులు మెరుస్తున్నాయి. గాలి తీవ్రంగా ఉంది. తుఫాను వచ్చేలా ఉంది.

తుఫానుగాదు ప్రళయం వచ్చినా తను భయపడడు, బాధపడడు. తనకక్కరలేని ఈ ప్రపంచం ఏమైతే తనకేం!

అతను కసిగా నవ్వుకున్నాడు. ఆ క్షణంలో అతనిలో బాధ, భయం, కోపరం దిగులు అన్ని భావాలు చెలరేగుతున్నాయి

తను ఏకాకి.

తనకోసం తపించేవాళ్ళు కాని, తను కావాలని కోరుకునే వాళ్ళుగాని ఎవ్వరులేరు.

ఈ విశాల విశ్వంలో తన బాధను పంచుకొని, తనను ఆదరించి, ఓదార్చే వాళ్ళు ఎవ్వరూ లేరు

అతని కళ్ళు నీటితో నిండాయి

ఎవ్వరికోసం తను జీవించాలి? ఎందుకోసం జీవించాలి?


అడుగడుగునా బాధలు, ప్రతిక్షణం కొత్త సమస్యలు.

తను ఈ జీవితం గడపలేడు.

దృఢసంకల్పంతో అతను 'స్లీపింగ్ పిల్స్' బాటిల్‌లోంచి తీశాడు. గొంతుక తడి చేసుకున్నాడు

మనిషి ఒణికి పోతున్నాడు. తామరాకు మీది నీటి బొట్లలాగ అతని నుదుట స్వేద బిందువులు మెరుస్తున్నాయి. అతని కళ్ళు భయంతో చలిస్తున్నాయి. చేతులు ఒణుకుతున్నాయి. గుండె దడ ఎక్కువయ్యింది.

చెయ్యి క్రిందికి వాలి పోయింది. అయినా .. తమాయించుకొన్నాడు. ఉపిరి

BEWARE OF IMITATIONS
A MUST FOR HOUSE-WIFE
BASOOK
CHOKE REMOVERS


COMMUNICATE TO US ABOUT SUCH IMITATIONS
V P P ORDERS EXECUTED
CONTACT: P. O. BOX No. 1780, BOMBAY-1

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు
ఆరోగ్య సౌభాగ్యములకు ఆధారపడునది లోధ్ర
66 సంవత్సరముల నుండి ప్రసిద్ధినొందినది

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ, సికింద్రాబాదు, మధుర, బరహంపురం, బెంగుళూరు

ఉచితము! ఉచితము!! ఉచితము!!!
తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము
శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "SWETARI" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. పాంప్లెట్ సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.
Sri Krishna Chandra Vaidya
(A.P.) P.O. Katrisarai (Gaya)

# నీలి నీడలు

తెచ్చుకొని మాత్రలు నోటిలో వేసుకోబోయాడు.

తలుపు చప్పుడయింది. ఉలిక్కిపడ్డాడు. అక్కడి నుంచి కదలలేదు. యీసారి చప్పుడు, కేక విన్పించాయి.

అతను భీతావహుడయ్యాడు.

ఈ సమయంలో, యీ పరిస్థితిలో తనను ఎవరైనా చూస్తే! అయినా యిప్పుడు తన కోసం వచ్చేవారెవ్వరు?

కంగారుగా బాటిల్ దాచాడు. మొహం తుడుచుకున్నాడు. నెమ్మదిగా వెళ్ళి తలుపు తీశాడు.

రయ్యిమని గాలి, వర్షం లోపల ప్రవేశించాయి. వాటితోపాటు ఒక వ్యక్తి దూసుకు వచ్చాడు.

ఆ వ్యక్తికి షుమారు ఏభై ఏళ్ళ ఉండవచ్చు. మనిషి ఒంగిపోయి బక్కగా ఉన్నాడు గడ్డం పెరిగి ఉంది. నీరసంగా కన్పించాడు. కొద్దిగా తడిచాడు.

'ఏం కావాల'న్నట్టుగా చూశాడు అతను. ఆ వ్యక్తి పట్టించుకోకుండా వెళ్ళి విరిగిన కుర్చీలో కూర్చున్నాడు.

ఆ సమయంలో వచ్చిన వ్యక్తిని చూసి అతనికి చిరాకు, కోపం కలిగాయి. తన భావాలేమి ప్రదర్శించకుండా అలాగే నిలబడ్డాడు.

'క్షమించాలి! మీకు శ్రమ కల్గించాను. బయట వర్షం విపరీతంగా కురుస్తోంది. చాలాసేపు మీ వరండాలో నిలబడ్డాను. కాని పూర్తిగా తడిచేలా ఉంటే చివరికి తలుపు తట్టాను' అన్నాడు ఆ వ్యక్తి అతని వంక చూస్తూ.

'తను చేస్తున్నదంతా గమనించాడా' అనే భావం తటుక్కున మెరిసింది అతనిలో. కాని తలుపులు అన్నీ మూసి ఉన్నాయిగదా అని సమాధాన పరచుకొన్నాడు.

'ఫరవాలేదు లెండి! యిందులో శ్రమ ఏముంది? బలవంతంగా చిరునవ్వు తెచ్చుకొని తుడుచుకోటానికి టవల్ యిచ్చాడు అతను.

మురికి వాసన వేసే టవల్‌తోనే ఆ వ్యక్తి తుడుచుకున్నాడు.

కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

అతను అసహనంగా అటు యిటూ తిరగసాగాడు. పరిస్థితి అంతా అయోమయంగా ఉంది. ఆ వ్యక్తి రాక అతనికో సమస్య అయింది. ఏమీ చెయ్యలేని సందిగ్ధావస్థలో పడ్డాడు.

కాస్సేపు కూర్చున్నాడు. తరువాత లేచి వర్షం తగ్గిందేమోనని కిటికీ తెరచాడు. జల్లు మీద బడింది. కిటికీ మూసి వచ్చి పుస్తకం తెరచాడు. దృష్టి పుస్తకం మీద ఉన్నా ధ్యాస ఎక్కడో ఉంది.

పుస్తకం మూసి అటుయిటూ తిరిగాడు. మళ్ళీ కూర్చున్నాడు.

'మీ పేరేమిటి?' నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ప్రశ్నించాడు ఆ వ్యక్తి.

'శేఖర్'

'ఏం చేస్తున్నారు?'

'ఏముంది చెయ్యటానికి! ఖాళీగానే ఉంటున్నాను' విరక్తిగా అన్నాడు శేఖర్.

అతనిమాట బలహీనంగా ఉంది. మనిషిలో ఉత్సాహం లేదు. తలపట్టుకు కూర్చున్నాడు

శేఖర్ ప్రవర్తన, మాటలతీరు ఆవ్యక్తికి ఆశ్చర్యాన్ని, అనుమానాన్ని కల్గజేశాయి. అతనివంక పరిశీలనగా చూశాడు.

అతనికి ముప్ఫయి ఏళ్ళుండవచ్చు. బక్కగా, పొడుగ్గా ఉన్నాడు. అసలు ఏరుపైనా సరియైన ఆహారం, పోషణలేక, నల్లబడ్డాడు కళ్ళు లోపలకు పోయాయి. ముఖంలో కళా, కాంతీ లేవు బట్టలు మాసిపోయాయి. విరాగిలా ఉన్నాడు.

'దేన్నిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నారు మీరు?'

'ఏమీ లేదండి. ఏదో మామూలు గొడవలు గురించే!'

'కాదు. మీరు మానసికంగా ఏదో బాధపడుతున్నారు!' నిశితంగా శేఖర్ కళ్ళలోకి చూస్తూ అన్నాడు ఆ వ్యక్తి.

'అబ్బే! అలాంటిదేమి లేదే! అలాంటిదేమీలేదు' మనసులో కలవరపాటును కప్పిపుచ్చుతూ సమాధాన మిచ్చాడు శేఖర్.

కాని అతని మాటలలో, పెదవులలో తడబాటు స్పష్టంగా తెలుస్తోంది.

'మరి యిన్నిసార్లు పిలిచినా పలకలేదే? వినపడలేదా?'

'ఆ పిలిచారా! అవును విన్నాను; విన్నాను! ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా

ఉండిపోయాను!' సమాధాన మిచ్చాడు శేఖర్.

నిజంగా నిలవలేదు ఆ వ్యక్తి. తన అనుమానం నిర్ధారణ చేసుకునేందుకు చీకటిలో బాణం వేశాడు. అది సరియైన చోట తగిలింది.

శేఖర్ ఎందుకో తీవ్రంగా బాధ పడుతున్నాడు. అది బుజువయింది. కాని కారణం అవగతం కాలేదు ఆ వ్యక్తికి. ఆ గది అంతా పరిశీలనగా చూశాడు.

మెరుపులు మెరవసాగాయి. ఎక్కడో పిడుగు పడ్డట్టు చప్పుడయింది.

'మీ ఒంట్లో బాగాలేదా?'

'లేదా. బాగానే ఉన్నాను.' శుష్కహాసం చేశాడు శేఖర్.

'మరి అదోలా ఉన్నారేం?'

'ఎలా ఉన్నాను?'

'ఏదో సమస్యలతో బాధపడుతున్నట్టుగా కన్పిస్తున్నారే?'

'మనుష్యలన్న తరువాత సమస్యలు లేకుండా ఉంటాయా?

'మీకు పెళ్ళయిందా'?

'లేదు.'

'ఎందుకు చేసుకోలేదు? ఎవరినైనా ప్రేమించారా?'

'ప్రేమించటం అనేది కడుపు నిండిన వాళ్ళు, కాలక్షేపం లేని వాళ్ళు చేసే పని. నాకలాంటి అవకాశం గాని, అదృష్టంగాని లేవు.'

'మరి జీవితం మీద విరక్తి ఎందుకు కల్గింది?' ఉలిక్కిపడ్డాడు శేఖర్. ఆ వ్యక్తి వంక అనుమానంగా చూశాడు.

తన సంగతి ఎలా తెలిసిందా అని క్షణకాలం ఆశ్చర్యపడ్డాడు. మరుక్షణం సిగ్గు, అవమానం, భయం అతన్ని ఆవహించాయి. మనిషి కుంచించుకుపోయాడు.

'చూడు, నాయనా! నీకన్నా వయస్సులో, అనుభవంలో పెద్దవాడ్ని. నీబాధ ఏదో చెబితే నేనేమి సహాయం చేయలేక పోవచ్చు. కాని నాకు తోచిన సలహా యివ్వగలను. అదీగాక మనసులో బాధ యితరులతో చెప్పుకుంటే కొంత ఉపశాంతి కల్గుతుంది. నీలో నువ్వే కుమిలి ప్రయోజనం ఏమిటి?' అనునయంగా అడిగాడు ఆ వ్యక్తి.

అన్నాళ్ళకు తనను ఆదరంగా ఓ వ్యక్తి పరామర్శించేసరికి అతని మనస్సు ద్రవిభూతమైంది.

అతను నెమ్మదిగా తన గురించి చెప్పాడు.

* * *

జీవితంలో కొంతమంది కష్టాలు అనుభవించడానికే పుడ్తారేమో! నేను పుడుతూనే ఒంటరివాణ్ణయ్యాను. తల్లిదండ్రులు లేని వాడి బ్రతుకు ఎలా గడుస్తుందో మీరు ఊహించుకోగలరు. నా ఆస్తిపైన మోజుతో నన్ను దగ్గర ఉంచుకుని పెంచాడు ఓ బంధువు.

నాచేత అడ్డమైన చాకిరీ చేయించేవాడు. ఏదైనా చిన్న పొరపాటు జరిగితే కొట్టేవాడు. ఎన్నయినా సహించేవాడిని గాని నన్ను ఏదైనా మాట అంటే ఊరుకునే వాడ్ని గాదు.

ఒక రోజు ఏదో సరుకులు తెమ్మని వందరూపాయల నోటు యిచ్చి పంపాడు. నేను బజారుకి వెళుతుంటే మధ్యలో ఓ గుంపు కనబడింది. 'ఏమిటా' అని కుతూహలంతో వెళ్ళి అక్కడ నిలబడ్డాను. ఎవరో ఒకతను హోటలులో టిఫిన్, కాఫీ తీసుకొని బిల్లు చెల్లించకుండా పోతున్నాడట. హోటలు యజమాని నిలవేసి అడిగితే 'నా దగ్గర డబ్బులేదు పొమ్మన్నా'డట. దాన్ని గురించి నానా రభస జరుగుతోంది.

నాకు జాలి వేసింది. నాకన్నా అభాగ్యులు ఎంతో మంది ఉన్నారని మనస్సుకు నచ్చచెప్పుకున్నాను.


షాపు దగ్గరికి వెళ్ళి డబ్బులు యిద్దామనుకొని జేబులో చెయ్యి పెడితే ఖాళీ. నోటు ఎవరో కొట్టేశారు.

దిక్కుదిక్కు మంటూనే యింటికి జేరాను. నెమ్మదిగా విషయం చెప్పాను. భగ్గుమంటూ లేచాడాయన. అడ్డమైన తిట్లు తిట్టాడు. యిష్టమొచ్చినట్లు కొట్టాడు చివరికి మా నాన్నగార్ని కూడ తిట్టేసరికి నా కోపం కట్టలు తెంచుకుంది.

'మీ కంత బాధగా ఉంటే నా డబ్బులోంచి తీసుకొమ్మని, అనవసరంగా మాట్లాడితే నేను సహించనని' తెగించి చెప్పాను. అంతటితో ఆయన రెచ్చిపోయి యింకా కొట్టాడు.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఒళ్ళంతా నొప్పులు. యింటిలోంచి వెళ్ళిపోదామా అనిపించింది. కాని ఆ పరిస్థితులలో బయటకు వెళ్ళి ఏం చెయ్యగలను. చదువు అసంపూర్తిగా ఉంది. వేరే ఆదరించే వారెవ్వరు లేరు, అక్కయ్య తప్ప.

అక్కయ్య పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. కట్నం డబ్బు యివ్వలేదనే నెపంతో ఆమెను అత్తవారింట్లో అందరు హింసించసాగారు. భర్త ఆదరణ కూడ ఆమెకు కరువైంది.



ఎప్పుడైనా ఉత్తరం వ్రాయటం తప్ప ఆమె ఏనాడు నా దగ్గరికి రాలేదు. నేను అక్కడికి వెళ్ళలేదు. వెళ్ళితే ఏం మర్యాద జరుగుతుందో తెలుసు.

నా ఆస్తి అమ్మి అయినా ఆమె కట్నం డబ్బు పంపించాలని తపన పడేవాడ్ని. కాని నా పరిస్థితి అధ్వాన్నంగా ఉంటే ఆమెకు నేనేం చెయ్యగలను? నిస్పృహాయుడిగా ఉండి పోయాను.

ఆ అనుభవాలు నాకు మనుష్యులమీద ద్వేషం కలిగించాయి. జీవితాలతో ఆటలాడుకునేవాళ్ళ మనస్తత్వాలు నాకు జుగుప్స కలిగించాయి.

డిగ్రీ వచ్చింది. నాకు వ్యక్తిత్వమంటూ ఏర్పడింది. ఆ మనుష్యుల నీడలు కూడ పడనిచోటికి పోవాలనిపించింది. నా ఆస్తి విషయం అడిగాను. పెద్ద పెట్టున నవ్వి, అప్పటివరకు నాకైన ఖర్చు నా ఆస్తికంటే ఎక్కువైందని ఏవో లెక్కలు చూపించి, పైగా ఏదో దయాధర్మాలమీద పోషించినట్లుగా మాట్లాడాడు ఆ బంధువు.

అది సత్యదూరం అని తెలిసినా, వాళ్ళతో వాదించటం యిష్టంలేక ఆ యిల్లు విడిచిపెట్టి వచ్చేశాను.

డిగ్రి ఉందికదా అని ధైర్యంతో వచ్చాను. కాని లోకాన్ని యింకా అర్థం చేసుకోవలసింది ఎంతో ఉందని తెల్సుకున్నాను.

ప్యూను ఉద్యోగానిక్కూడ మినిష్టరు గారి రెకమండేషన్ కావలసివస్తున్న ఈ రోజుల్లో నాకు ఉద్యోగం ఎలా దొరుకుతుంది?

ఎంత ప్రయత్నించినా ప్రయోజనం శూన్యం. ఓ షాపులో లెక్కలు వ్రాసేవాణ్ణి. పిల్లలకు ప్రైవేటు చెప్పేవాడ్ని. తీరికగా ఉన్నప్పుడు ఏదో బొమ్మలు గీసేవాణ్ణి.

అలాగే కాలం వెళ్ళబుచ్చాను.

అక్కయ్య దగ్గరనుంచి ఉత్తరాలు వస్తుండేవి. ఒకసారి తను దెబ్బలతో మంచాన పడి ఉన్నానని, లేవలేకపోతున్నానని వ్రాసింది. ఒకరికొకరు సానుభూతి చూపుకునేవాళ్ళం. అంతకన్నా ఏం చెయ్యగలం?

వెళ్ళి అక్కయ్యను నా దగ్గరికి తెచ్చుకుందామా అనుకున్నాను. భర్తను విడిచి రావటానికి అక్కయ్య ఒప్పుకుంటుందా? అదీగాక నా సంపాదన అంతంతగా ఉంది. ఏమీ చెయ్యలేకపోయాను.

దొంగ లెక్కలు రాయనన్నానని షాపులోంచి తీసేశారు. ఇదివరకటిలా ఉత్సాహంగా ప్రైవేట్లు చెప్పలేకపోయాను. పరధ్యానంగా ఉండేవాడిని.

నెమ్మదిగా ప్రైవేట్లు అన్నీ పోయాయి. నాలో ఉండే ఉత్సాహం, ఉల్లాసం పూర్తిగా నశించాయి.

ఉద్యోగం లేకుండా ఎలా గడపగలను? అలాగే పస్తులు చేస్తూ కాలం గడిపాను.

చిత్రలేఖనం మీద ఆసక్తి కూడా పోయింది. ఆదరణ లేని కళ ఎలా అభివృద్ధి చెందుతుంది. క్లాసికల్ ఆర్ట్‌కి స్థానం లేదు. స్త్రీని నగ్నంగా చిత్రిస్తే సులభంగా పేరు, డబ్బు సంపాదించవచ్చని ఎవరో సలహా యిచ్చారు కాని నా మనస్సు అందుకు అంగీకరించలేదు.

ఏమీ లేకుండా ఎన్నాళ్ళు గడపగలను? వీలైన చోటల్లా అప్పులు చేశాను. ఎలా తీర్చగలనో నాకే తెలియదు. నా జీవితంలో నీలినీడలు అలుముకున్నాయి.

బ్రతుకు మీద విరక్తి కలిగింది? నేను ఎందుకోసం జీవిస్తున్నానో నాకే అర్థం కాలేదు.

రెండు రోజుల క్రితం ఉత్తరం వచ్చింది, అక్కయ్య శాశ్వతంగా యీ లోకాన్ని విడిచి వెళ్ళిపోయిందని నాకు ఉన్న ఒక్క బంధం తెగిపోయింది.

ఈ లోకంలో నాకు సానుభూతి కూడ కరువైంది.

యిన్ని బాధలతో, సమస్యలతో బ్రతికి ఏం సాధించాలి? క్షణక్షణం మరణించే కన్నా ఒక్కసారే జీవితం ముగించుకోడం మేలనిపించింది.

కాని ఆ ప్రయత్నం గూడ...'

శేఖర్ కంఠం గాద్గదికమయింది. అతని కన్నులలో నీరు నిలిచింది. తల వంచుకు కూర్చున్నాడు.

'చూడు నాయనా! నీ బాధలను, సమస్యలను నేనర్థం చేసుకోగలను. ప్రపంచంలో బాధలు లేకుండా ఏ వ్యక్తి ఉండడు. అంతమాత్రం చేత అందరూ ఆత్మహత్య చేసుకుంటున్నారా?

జీవితమనేది ఓ ఆటవస్తువు గాదు అవసరం లేనప్పుడు విడిచిపెట్టడానికి, యిష్టం లేనపుడు పారవేయడానికి.

జీవితం ఓ గొప్పవరం. దాన్ని పదిలంగా దాచుకోవాలిగాని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు.

ఈ ప్రపంచంలో చాలమంది భవిష్యత్తులో జీవిస్తున్నారు ఎప్పటికైనా ఏదో మంచి జరుగుతుందనే ఆశ, ఆసక్తి వాళ్ళను ముందుకు నడిపిస్తాయి. ఇంతెందుకు నా సంగతి చూడు!' అంటూ చెప్ప నారంభించాడు ఆ వ్యక్తి.

శేఖర్ కుతూహలంగా ఆ వ్యక్తి వంక చూశాడు.

'నేను సంపన్నుల కుటుంబంలో పుట్టాను. సకల దుర్వ్యసనాలకు దాసుడనయ్యాను. యవ్వనాన్ని నిర్లక్ష్యంగా ఖర్చు పెట్టాను. దేన్నీ లెక్క పెట్టేవాణ్ణిగాను. ఏ సంగతి పట్టించుకునేవాణ్ణిగాను. చివరకు నా భార్యకు సరియైన మందులుకూడ యిప్పించక ఆమెను దూరం చేసుకున్నాను. మిగిలిన కుమార్తె విషయం కూడ ఆలోచించేవాణ్ణిగాదు.

ఆస్తి అంతా విచ్చలవిడిగా ఖర్చు పెట్టాను. అప్పటికీ నా అలవాట్లు మానలేదు. అప్పుచేసి త్రాగేవాణ్ణి, పేకాట ఆడేవాణ్ణి.

రకరకాల స్త్రీల సాంగత్యంవల్ల ఈనాడు నా వంట్లో అన్నీ జబ్బులే. త్రాగకుండా ఉండలేను. స్త్రీ లేకుండా గడపలేను. ఈ మధ్య దగ్గుకూడ ప్రారంభమైంది. పరీక్షిస్తే క్షయ అని తేలింది.

నా కుమార్తెకు ఏమి మిగల్చలేకపోయాననే ఆవేదన, నా తరువాత ఆమె గతి ఏమిటి అనే బెంగ నన్ను పీడించాయి.

శారీరక ఆవేదన, మానసిక వేదనలతో కృంగి కృశించిపోయాను.

నిర్వీర్యంగా మిగిలిపోయాను.

అయినా నాకు బ్రతుకు మీద విరక్తి కలగలేదు! యువకుడివి, కళాకారుడివి, ఎంతో భవిష్యత్తు కలవాడివి. యీ చిన్న విషయాలకే జీవితం మీద నీకు విరక్తి ఎందుకు కలిగింది?

నీవు మరణించినా నీలోని కళ నశించగూడదు. నీ కళ శాశ్వతం గావాలంటే

నీవు జీవించాలి. ఏనాటికైనా ఈ సంఘం నీలోని కళా ప్రతిభను గుర్తిస్తుంది. నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంది,' అంటూ ముగించాడు ఆ వ్యక్తి.

దగ్గు తెరలు తెరలుగా వచ్చింది. నోటి నుంచి రక్తం కక్కుకున్నాడు. శేఖర్ నెమ్మదిగా గుండె నిమిరాడు. కాసేపు బాధ పడి ఆ వ్యక్తి అలాగే నిద్రపోయాడు.

శేఖర్ కూడ ప్రక్కనే పడుకున్నాడు. అతనికి నిద్ర పట్టలేదు. ఆ వ్యక్తి చెప్పిన మాటలు అతనిలో సంచలనం కల్గించాయి.

డబ్బు లేనంతమాత్రాన, ఉద్యోగం రానంతమాత్రాన తాను మరణించవలసిందేనా?

లేనివాళ్లందరూ జీవించటం లేదా? ఏనాటికైనా తన కళా ప్రతిభను ఈ లోకం గుర్తిస్తుంది. తను పిరికివాడులా ఈ లోకం నుంచి పారిపోలేడు. అవును. తను జీవించాలి. జీవించాలి. జీవించాలి...

అతని హృదయం తేలికైంది.

వర్షం తగ్గింది. కిటికీ తలుపులు తీశాడు. చల్లటిగాలి లోపలకు వచ్చింది. అంతా ప్రశాంతంగా ఉంది.

కాస్సేపటికి అతను నిద్రబోయాడు.

* * *

రాత్రి ఆలస్యంగా నిద్రబోయాడేమో ఎప్పుడో మెలకువ వచ్చింది శేఖర్‌కు. సిగ్గుపడుతూ లేచాడు.

ఆ వ్యక్తి యింకా లేవలేదు. నెమ్మదిగా తట్టాడు. కదలలేదు. అనుమానంతో గట్టిగా తట్టాడు.

ఆ వ్యక్తి నిర్జీవుడై పడి ఉన్నాడు. శేఖర్ కంగారు పడ్డాడు. అతనికి విపరీతంగా భయం వేసింది. అయోమయంగా అటు యిటూ తిరిగాడు. ఏం చెయ్యాలో తెలుపోలేదు.

అతనిదృష్టి టేబుల్‌మీదకు పోయింది. స్లీపింగ్‌పిల్స్‌బాటిల్ ఖాళీగాఉంది. ప్రక్కనే తను వ్రాసిన ఉత్తరం ఉంది. చించివేయబోయాడు. కాని అది తాను వ్రాసింది గాదు. తనువ్రాసిన ఉత్తరం ముక్కలుక్రింద పడి ఉన్నాయి. గబగబా చదివాడు.

'నాయనా శేఖర్!

నీవు ఈ ఉత్తరం చూసేసరికి నేను ఈలోకంలో ఉండను. ఆశ్చర్యంగా ఉంది కదూ! జీవితంగురించి యిన్ని ధర్మపన్నాలు చెప్పి యిలా ఎందుకు చేశానా అని!—

నాకు జీవితంమీద విరక్తి పుట్టింది. ప్రతిక్షణం నన్ను బాధించే యీరోగాలతో వ్యసనాలతో, జ్ఞాపకాలతో నేను జీవించలేను.

నేను బాధపడుతూ యితరుల్ని బాధపెడుతూ బ్రతికి నేను సాధించేది ఏమిటి? ఆస్తి నాశనం చేయటం తప్ప.

నాకథ నీకు చెప్పాను. కాని అది అంతా నిజం కాదు. కొంత కల్పించి చెప్పాను. నీమనస్సు మార్చటం కోసం అలా చేశాను.

నాఆస్తి పూర్తిగా పాడు చేశాను. కాని నాభార్యపేర ఉన్న ఆస్తిని నేను ముట్టుకోలేదు. అదే నేనుచేసిన ఒక్క మంచి పని అనిపిస్తోంది.

నా తదనంతరం ఆస్తి నా కుమార్తెకు చెందుతుంది. యిదివరకే అన్ని ఏర్పాట్లు చేశాను.

నీనుంచి ఒకసహాయం అర్థిస్తున్నాను. నాకుమార్తె ఒంటరిదై పోయింది. ఆమెను ఓదార్చవలసిన బాధ్యత నీమీద పెడుతున్నాను. ఆమె ఆస్తిని సంరక్షించ వలసిన భారం కూడ నీదే.

నన్నువిడిచి వెళ్లడానికి యిష్టపడక ఆమె పెళ్లిచేసుకోవటానికి నిరాకరించేది. అందుకే ఆమెకు నేను దూరంగా పోతున్నాను.

పండుటాకు ఏనాటికైనా నేల రాలవల్సిందేగాదా!

మీ మనస్సులు కలిసి మీరిద్దరు పెళ్లి చేసుకుంటే అంతకన్న నేను కోరేది లేదు.

నీలాంటి సహృదయుడి సాహచర్యంలో నాకుమార్తె సుఖపడుతుందనే నమ్మకం నాకున్నది.

నీజీవితంలోంచి నీలి నీడలు తొలిగిపోతాయి. నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంది.

మీ యిరువురూ కలిసి హాయిగా జీవించాలని నా అంతిమకోర్కె. మీకే కష్టం రాకుండా అవసరమైన ఉత్తరాలు యిందులో జత పరుస్తున్నాను. నాగురించి విచారించకండి. ఆశీస్సులతో, —రాజారావు'

చదవటం ముగించిన శేఖర్ మనస్సులో ఏవో ఆశించని సహృదయత సంఘర్షణలు చెలరేగాయి. అతనికళ్లు నీటితో నిండాయి.

